క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



క్రీడా పరికరాలు అందిస్తున్న అల్ట్రాటెక్ ప్రతినిధులు

కొలిమిగుండ్ల: గొర్విమానుపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం అల్ట్రాటెక్ సిమెంట్ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి అందజేశారు. రూ.40 వేల విలువ చేసే క్రికెట్, వాలీబాల్, క్యారంబోర్డు తదితర క్రీడా పరికరాలను అందించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో సిమెంట్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పంక్షన్‌హెడ్ రంగకుమార్ తెలిపారు. హెచ్‌ఓడీ అడ్మిన్ అంజన్‌ప్రకాష్, సీఎస్ఆర్ సూరపునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



శ్రీనివాసులును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి టి.శ్రీనివాసులు రాష్ట్రస్థాయి బాక్సింగ్, కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం వరప్రసాదరావు బుధవారం తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మచిలీపట్నం ఇండోర్ స్టేడియంలో జరిగిన అండర్-17 బాక్సింగ్ 52-54 కేజీల విభాగంలో కాంస్యం, ఇటీవల వైఎస్సార్ జిల్లా రాయచోటిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా టీం కెప్టెన్‌గా కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. విద్యార్థి శ్రీనివాసులుతో పాటు బాక్సింగ్ కోచ్ వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్‌ను అభినందించారు.

జాతీయ మహా సభలను జయప్రదం చేద్దాం



కరపత్రాలను విడుదల చేస్తున్న మహిళా సమాఖ్య నాయకులు

డోన్ రూరల్: దేశ రాజధాని ఢిల్లీలో డిసెంబర్ 6,7,8వ తేదీల్లో జరగనున్న 22వ జాతీయ మహిళా సమైఖ్య మహా సభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా గౌరవ అధ్యక్షురాలు బాలమ్మ, కార్యదర్శి రజిత, ఆర్గనైజింగ్ కార్యదర్శి షమీం బేగం పిలుపునిచ్చారు. డోన్‌లోని సీపీఐ కార్యాలయంలో బుధవారం మహా సభల కరపత్రాలను విడుదల చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న కుటుంబ, సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మహా సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమృతారెడ్డి, లక్ష్మీదేవి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



హిమాయత్

బేతంచెర్ల: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో నివాసం ఉంటున్న మహ్మద్ రఫీ కుమారుడు హిమాయత్ అదృశ్యంపై కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 25న కర్నూలుకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బంధువులు, చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకుండా పోయింది. తండ్రి రఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు.

ఉపాధి పనుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ

బేతంచెర్ల: ఉపాధి హామీ పనుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని డీఎల్‌డీఓ నరసింహారెడ్డి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలో మంజూరైన 38 గోకులం షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించాలని సూచించారు. ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు మంజూరైన వాటిని త్వరగా తవ్వించాలన్నారు. పండ్ల తోటలు 180 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 117 ఎకరాలు పూర్తి చేశారని తెలిపారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి గ్రామం వదిలివెళ్లిన వారి పేర్లను జాబు కార్డు నుంచి తొలగించి కొత్తవారికి కార్డులు మంజూరు చేయాలన్నారు.

డేంజర్ రోడ్..!

- ప్రమాదాలకు నిలయంగా కోవెలకుంట్ల- బనగానపల్లె రోడ్డు
- నడిరోడ్డుపైనే నిలుస్తున్న భారీ వాహనాలు
- ఏమరుపాటుతో గాలిలో కలిసిపోతున్న నిండు ప్రాణాలు
- ఏడాది వ్యవధిలో ఆరుగురు మృత్యువాత
- ఆ రోడ్డుపై ప్రయాణం భయం..భయం



కోవెలకుంట్ల- బనగానపల్లె ఆర్అండ్‌బీ రహదారిలో నిలిచిన భారీ వాహనాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- బనగానపల్లె ఆర్అండ్‌బీ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రతి రోజు ఈ రహదారి మీదుగా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, కర్నూలు, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు రహదారి దగ్గరి మార్గం కావడంతో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. మండలంలోని అమడాల మెట్ట నుంచి కోవెలకుంట్ల పట్టణంలోని బనగానపల్లె చౌరస్తా మధ్యలో ప్రయాణం భయం.. భయంగా మారింది. ఏడాది వ్యవధిలో ఈ ప్రాంతంలో దాదాపు ఆరుగురు రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డారు. రాత్రి వేళల్లో ఈ రహదారిలో ఎక్కువ శాతం ప్రమాదాలు చోటు చేసుకుని నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, వాహనాలను ఎక్కడపడితే అక్కడే నడిరోడ్డుపైనే ఆపడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు.

ఆగి ఉన్న వాహనాలను ఢీకొని మృత్యువాత

ఈ రహదారిలో ఎక్కువ శాతం ప్రమాదాలు ఆగి ఉన్న వాహనాలను ఢీకొని జరుగుతున్నవే. మండలంలోని అమడాల మెట్ట సమీపంలో జడలయ్య స్వామి ఆశ్రమం ఉంది. ఇక్కడ నిత్యాన్నదానం జరుగుతుంది. ఈ మార్గంలో ప్రయాణించే భారీ వాహన చోదకులు నడిరోడ్డుపైనే ఆపి సేద తీరుతున్నారు. బనగానపల్లె మండలం యనకండ్ల సమీపంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఉండడంతో తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఫ్లయాస్ ట్యాంకర్లు ఈ మార్గం ద్వారా ప్రతి రోజు రాకపోకలు సాగిస్తాయి. అమడాల మెట్ట, సొదరదిన్నె గ్రామ సమీపంలో ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్ ఉండడంతో భారీ వాహనాలను రాత్రి వేళల్లో నడిరోడ్డుపైనే నిలుపుతున్నారు. వాహనాలు నిలిచి ఉన్నట్లు ఎలాంటి ఇండికేటర్లు వేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణమవుతోంది. ద్విచక్ర వాహన చోదకులు రాత్రి వేళల్లో నిలిచి ఉన్న వాహనాలను ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి తోడు ఈ ప్రాంతాల్లో ఎలాంటి స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో అతివేగం ప్రాణాలను కబళిస్తోంది.

రహదారిలో ప్రాణాలు కోల్పోయిన వారి వివరాలు

- గత ఏడాది అక్టోబర్‌లో బనగానపల్లె చౌరస్తా మలుపు వద్ద అమడాలకు చెందిన బాలమద్దయ్య అనే యువకుడు మృతి.
- ఈ ఏడాది జనవరిలో అమడాల మెట్ట సమీపంలో ఇదే గ్రామానికి చెందిన మద్దిలేటి ఫ్లయాస్ ట్యాంకర్ కింద పడి దుర్మరణం.
- ఏప్రిల్ నెలలో బనగాపల్లె చౌరస్తా మలుపు సమీపంలో వెలగటూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లారీ కింద పడి మృత్యువాత.
- ఆగస్టు నెలలో బనగానపల్లె చౌరస్తా మలుపు వద్ద అమడాలకు చెందిన గుర్రప్ప అనే వ్యక్తి ఆర్టీసీ బస్సు కింద పడి మృతి.
- అక్టోబర్‌లో సొదరదిన్నె సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొని బనగానపల్లె మండలం కొత్తపేటకు చెందిన మహబూబ్‌బాషా అనే యువకుడి దుర్మరణం.
- ఇదే నెలలో అమడాల మెట్ట సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొని బనగానపల్లెకు చెందిన ఖాజా ఉసేన్ అనే యువకుడు మృతి చెందగా సద్దాం ఉసేన్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.

ఆగి ఉన్న వాహనాల వల్లే ప్రమాదాలు



కోవెలకుంట్ల- బనగానపల్లె ఆర్అండ్‌బీ రహదారిలో ఆగి ఉన్న వాహనాల వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహన చోదకులు వివిధ పనుల నిమిత్తం నడి రోడ్డుపై భారీ వాహనాలు ఆపుతుండడంతో ద్విచక్ర వాహన చోదకులు గమనించకుండా వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఏడాది వ్యవధిలో గ్రామానికి చెందిన ముగ్గురు రోడ్డు ప్రమాదాలకు గురై మృతి చెందారు. -కుళాయప్ప, అమడాల, కోవెలకుంట్ల

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



కోవెలకుంట్ల- బనగానపల్లె ఆర్అండ్‌బీ రహదారిలో సొదరదిన్నె, అమడాల మెట్ట ప్రాంతాల్లో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. స్పీడు బ్రేకర్లు లేకపోవడానికి తోడు రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు అతి వేగంగా వెళుతూ ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఈ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో భారీ వాహనాలు ఆగకుండా అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు ప్రమాదాలను నివారించాలి. -రమణారెడ్డి, సొదరదిన్నె, కోవెలకుంట్ల

ప్రత్యేక ఆధార్ సేవలు పొడిగింపు

బేతంచెర్ల: పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సేవలు గురువారం కూడా కొనసాగుతాయని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్ క్యాంపులో సవరణలు ఏవైనా ఉంటే విద్యార్థులు సరి చేయించుకోవాలని సూచించారు.

1న మండల మీట్

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిసెంబర్ 1వ తేదీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్, రెవెన్యూ, ఉపాధి హామీ పథకం, వెలుగు, రోడ్డుభవనాలు, పంచాయతీరాజ్, పశుసంవర్థక, స్త్రీ,శిశు సంక్షేమం, తదితర శాఖలపై చర్చ జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ, మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

పంటలో పురుగు నివారణకు చర్యలు

బేతంచెర్ల: మండలంలో రబీలో సాగు చేసిన మినుము, పెసర పంటల్లో తామర పురుగును గమనించామని.. నివారణ చర్యలు చేపట్టాలని ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్దవరం, ఎం, పేండేకల్లులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో వేసిన శనగ, మినుము, పెసర, ఉల్లి, వేరుశనగ పంటలకు బీమా చేసుకోవాలని సూచించారు.

ఈ-పంట నమోదుతోనే నష్టపరిహారం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ నిరంజన్,



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం సంభవిస్తే ఈ పంట నమోదు ఆధారంగానే నష్ట పరిహారం అందుతుందని మండల వ్యవసాయాధికారి నిరంజన్ అన్నారు. బుధవారం మండలంలోని రేవనూరు, ఎం. ఉప్పలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఆయా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తుల విక్రయానికి ఈ పంట నమోదు ప్రామాణికమన్నారు. రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ, మినుము, జొన్న పంటలకు ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం ద్వారా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు.

పంట బీమాపై అవగాహన

బనగానపల్లె: మండలంలోని యాగంటిపల్లి, యనకండ్ల గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి పంట బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రబీలో సాగు చేసిన జొన్న, పప్పుశనగ తదితర పంటలకు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు. డిసెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. జిల్లా వనరుల అధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి పంటలకు ఆశించే వివిధ రకాల తెగుళ్ల నివారణపై రైతులకు వివరించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



సురేశ్ బాబును సన్మానిస్తున్న దృశ్యం

ప్యాపిలి: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ తొగట సురేశ్ బాబును టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. సమాజాన్ని పురోగమింపజేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని తెలిపారు. విలువలతో కూడిన విద్యను బోధిస్తూ ఉత్తమ వ్యక్తిత్వం కలిగిన పౌరులను తయారు చేసేది ఉపాధ్యాయులే అన్నారు. కార్యక్రమంలో ప్రచార మండలి సభ్యులు దేవీ దయానంద్ సింగ్, వివిధ ఆలయాల నిర్వాహకులు కంచి నరేశ్ కుమార్, గోపాల్ రెడ్డి, పట్టణ ప్రముఖులు రామాంజనేయులు, రంగనాథ్, లక్ష్మి రంగయ్య పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు



విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న విజిలెన్స్ అధికారులు

కొలిమిగుండ్ల: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని విజిలెన్స్ ఈఈ గోపీ హెచ్చరించారు. బుధవారం మండలంలోని అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, కొలిమిగుండ్లతో పాటు పలు గ్రామాల్లో దాడులు చేశారు. మీటర్లు ఏర్పాటు చేసుకోకుండా అక్రమంగా విద్యుత్ ఉపయోగిస్తున్న ఇళ్లకు చెందిన విద్యుత్ తీగలను తొలగించారు. అక్రమ విద్యుత్‌కు సంబంధించి 18 కేసులు నమోదు చేసి రూ.1.7 లక్షలు, అదనపు లోడ్‌కు చెందిన వాటిపై 10 కేసులు నమోదు చేసి రూ.1.5 లక్షలు జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో తరచూ దాడులు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడకుండా మీటర్లు అమర్చుకోవాలని ప్రజలకు సూచించారు. విజిలెన్స్ ఏడీఈ క్రిష్ణమూర్తి, ఏఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఐదుగురిపై కేసు

అవుకు: మండలంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసి రూ.80 వేలు జరిమానా విధించినట్లు విజిలెన్స్ ఈఈ గోపి తెలిపారు. అలాగే అదనపు వినియోగానికి సంబంధించి పది మందిపై కేసు నమోదు చేసి రూ.1.70 లక్షలు ఫైన్ విధించినట్లు వెల్లడించారు. బుధవారం అవుకు మండల పరిధిలోని రామాపురం, చెర్లోపల్లె గ్రామాల్లో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విద్యుత్ అక్రమ కనెక్షన్లు, అధిక లోడుతో వినియోగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈఈ హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ ఏడీఈ కృష్ణమూర్తి, ఏఈ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

డోన్ ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

- మొదటిసారిగా తుంటి ఎముకకు శస్త్రచికిత్స
- విజయవంతంపై వైద్యులు, రోగి బంధువుల హర్షం



మద్దమ్మతో ఆస్పత్రి సూపరింటెండెంట్ హనీఫ్, ఆర్థోపెడిక్ సర్జన్ గౌస్

డోన్: డోన్ ప్రభుత్వ ఆస్పత్రిలో తుంటి ఎముక ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. వివరాలు.. డోన్ మండలం చింతలపేట గ్రామానికి చెందిన మద్దమ్మ(60) గ్రామంలో కూలి పని చేసుకుంటూ జీవిస్తుండేది. నాలుగు నెలల క్రితం ఎద్దు పొడవడంతో కిందపడి తుంటి ఎముక విరిగిపోయింది. కుటుంబ సభ్యులు, బంధువులు నాటువైద్యుని వద్దకు తీసుకెళ్లి కట్టు కట్టించారు. ఎలాంటి ప్రభావం చూపకపోవడంతో నాలుగు నెలలుగా మంచానికే పరిమితమైంది. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వాస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్ గౌస్ అహ్మద్ ఆమెను పరీక్షించేందుకు ఆస్పత్రికి తీసుకురమ్మన్నారు. అన్ని పరీక్షలు నిర్వహించిన తర్వాత ఆమెకు బయోపోలార్ హెమి ఆర్థోప్లాస్టిక్ అనే శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ ఆధ్వర్యంలో గౌస్ అహ్మద్, ఇతర వైద్య సిబ్బంది మద్దమ్మ తుంటి ఎముకకు ఈనెల 26వ తేదీ (మంగళవారం) శస్త్ర చికిత్స చేశారు. ఆమె ప్రస్తుతం ఎలాంటి సహాయం లేకుండా ఒక్కతే నడవగలుగుతోంది. దీంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. దీనిపై సూపరింటెండెంట్ హనీఫ్, ఆర్థోపెడిక్ సర్జన్ గౌస్ మహ్మద్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లోని వైద్యశాలల్లో ఇలాంటి శస్త్రచికిత్సలు అరుదుగా జరుగుతాయని తెలిపారు. కాగా తనకు పునర్జన్మ ప్రసాదించిన వైద్యులకు మద్దమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో వసతులు

డోన్ ఏరియా ఆస్పత్రిలో ఆపరేషన్లకు అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో రోగులు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.40 కోట్ల వ్యయంతో వంద పడకల ప్రభుత్వాస్పత్రిని నిర్మించింది. అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చింది. దీంతో ఇక్కడే గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్జి తంగమణి



డోన్: గాంధీ విగ్రహం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, పోలీసులు, ప్రజలు

డోన్ టౌన్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం డోన్‌లోని జ్యోతిరావుపూలే గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా శిక్షార్హులవుతారని తెలిపారు. అమ్మాయిలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలని చెప్పారు. తెలిసీతెలియని వయస్సులో పెళ్లి చేయడం వల్ల శారీరక, మానసిక, ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. వారి భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జీవితంలో స్థిరపడిన తర్వాతనే పెళ్లి గురించి ఆలోచించాలని తెలిపారు. బాలికా విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. బాలికలు సమాజంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు, మహిళల సంరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే ప్రభుత్వ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చి అడ్డుకుంటాం అని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి-2 రామనర్సప్ప, ఎస్ఐ నరేంద్రకుమార్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, బార్ కౌన్సిల్ అధ్యక్ష ఉపాధ్యక్షులు వేణుగోపాల్‌గౌడ్, బద్దల వెంకటేష్, సహాయ కార్యదర్శి నాగరాజుగౌడ్, న్యాయవాదులు కుమారి, భాగ్య, రాఘవేంద్ర, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అరుణకుమారి పాల్గొన్నారు.

బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం

బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిద్దిడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహూల్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించి పాతబస్టాండ్‌గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఆడపిల్ల చదువు అవనికి వెలుగు అన్నారు. బాల్య వివాహాల దురాచారం రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఎస్ఐ నరేంద్రకుమార్ పాల్గొన్నారు.



బనగానపల్లె: అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ

అవగాహన

బనగానపల్లె రూరల్: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బనగానపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. గ్రామ స్థాయిలో విధులు నిర్వహించే అంగన్‌వాడీ వర్కర్లు బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్యవివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం అని పేర్కొన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది

డోన్ టౌన్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని డీఎస్పీ శ్రీనివాసులు, శతవధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకుని బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆలయ ప్రధాన అర్చకుడు శేషావలిశర్మ చేపట్టిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం శేషావలి దంపతులను సత్కరించారు. కార్తీక మాసం విశిష్టత గురించి దత్తాత్రేయశర్మ ప్రసంగించారు.

వీరశైవ లింగాయత్‌ల కార్తీక వనభోజనం



కార్తీక వనభోజనాలు చేస్తున్న లింగాయత్‌లు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో మండల వీరశైవ లింగాయత్‌ల ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామికి ఆలయ అర్చకులు చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. సామూహికంగా కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక వనభోజనం చేశారు. మల్లికార్జున, యాగంటయ్య, నాగేశ్వరప్ప, ప్రసాద్, నాగార్జున, విశ్వనాథ్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం



విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి

ప్యాపిలి: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారిణి వాణిశ్రీ అన్నారు. స్థానిక కేజీబీవీలో బుధవారం 180 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ప్రతి రోజూ స్నానం చేయడంతో పాటు భోజనం చేయడానికి ముందు, చేసిన తర్వాత చేతులను శుభ్రంగా కడగాలన్నారు. ఆరోగ్యపరంగా సమస్యలు ఉంటే వెంటనే ఉపాధ్యాయినీల దృష్టికి తీసుకురావాలన్నారు. తద్వారా వెంటనే వైద్య చికిత్స పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం మాదినేనిదొడ్డి గ్రామంలో 40 మందికి బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ ప్రియాంక, వైద్యసిబ్బంది రాఘవేంద్ర, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

మట్కాబీటర్ల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో మట్కా బీట్ నిర్వహిస్తున్న ఇద్దరిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కాలనీకి చెందిన తిరుపాలు, కుళాయి, శ్రీను అనే వ్యక్తులు మట్కాబీట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి మట్కా చీటీలు, రూ. 4,800 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోగా తిరుపాలు పారిపోయాడని, ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



వారం రోజుల క్రితం నేలవాలిన జొన్నపంట,



ప్రస్తుతం యథావిధిగా వచ్చిన పంట

పడిలేచిన జొన్న పంట

కొలిమిగుండ్ల: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో సాగులో ఉన్న పంటలు నేలకొరగడం, దెబ్బతినడం చూస్తుంటాం. అయితే ఎలాంటి గాలి, వాన లేకపోయినా నేలకొరిగిన పంట వారం రోజుల వ్యవధిలో తిరిగి యథాస్థానానికి చేరుకోవడంతో ఇది ఎలా సాధ్యమని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులకే అంతుచిక్కడం లేదు. వివరాల్లోకి వెళితే.. కొలిమిగుండ్ల మండలం కోటపాడుకు చెందిన రైతు మోహన్‌రెడ్డి ఎకరా విస్తీర్ణంలో రాయచూరు జొన్న సాగు చేశాడు. సరిగ్గా వారం క్రితం ఉన్నట్లుండి గాలి, వాన లేకపోయినా పంట నేలకొరిగింది. ఈ పరిణామంతో రైతు విషయాన్ని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లాడు. వాళ్లు పంటను పరిశీలించి ఏమి చేయడానికి వీలు లేదు, పంట రికవరీ అయ్యే అవకాశం లేదని తేల్చేశారు. చేసేది లేక రైతు మొదట పంటను దున్నేయాలని భావించాడు. మళ్లీ ఆలోచించి పశువులకు మేత కోసం ఉపయోగపడుతుందని ఆలోచించి గ్రామంలోని మరొక రైతుకు సూచించడంతో నాలుగైదు రోజుల్లో కోసుకుంటానని చెప్పాడు. అయితే మంగళ, బుధవారం రెండు రోజుల్లోనే ఎవరూ ఊహించని విధంగా పడిపోయిన జొన్నపంట యథాస్థానంలో నిలబడింది. సాధారణంగా వాణిజ్య పంటలు నేలకొరిగాక తిరిగి లేవడం వ్యవసాయ చరిత్రలో అద్భుతమని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.